# నిలువు దోపిడీ

బొంబాయి-కరీంనగర్ బస్సు కమ్మర్‌పల్లిలో ఆగింది. ఒక చేతిలో టేప్‌రికార్డర్ ఇంకో చేతిలో నల్లద్దాలు పట్టుకుని బస్సు దిగాడు పోశయ్య. చంకన ఉన్న ఎయిర్ బ్యా అతను గల్ఫ్ దేశం నుంచి వస్తున్నట్టు చెప్పకనే చెబుతోంది. రెండు పెద్ద సూట్‌కేసల టాప్ నుంచి దింపించి, డ్రైవర్‌కు మామూలిచ్చి, కూలికి ఇరవై రూపాయల నోటు పారేశా అతను.

ఒక నిమిషం తేరిపార చూసి దగ్గర్లోని హోటల్లోకి నడచాడతను. దాదాపు మూడ సంవత్సరాల తర్వాత చిర పరిచితమైన ఊరిలో అడుగు పెట్టాడు పోశయ్య. అక్కడి దాదాపు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న "బషీరాబాద్", అతని ఊరు.

హోటల్లోకి దృష్టి సారించాడు పోశయ్య. తనకు పరిచయమున్న వారెవర కన్పించలేదు. తను మస్కట్‌లో ఉన్న ఈ మూడేళ్ళలో ఊరు చాలా మారినట్టుంది. ఎన కొత్త షాపులు వెలిశాయి. "శివ మ్యూజిక్ అండ్ రికార్డింగ్ స్టోర్" నుంచి వెలువడే పాట హోరు మాత్రం మారలేదు. ఉల్లి పకోడీలు ఆర్డర్ చేసి ఆలోచిస్తున్నాడు.

'ఇంకో అరగంటలో తన ఊరు చేరుకుంటాడు. చెప్పాచేయకుండా వచ్చిన తనన చూసి తన వాళ్ళు ఆశ్చర్యానందాలకు లోనవుతారు! ఇల్లు, పొలం తాకట్టు పెట్టి, త మస్కట్ ప్రయాణం కొరకు చేసిన అప్పు, వడ్డీతో సహా చెల్లించేసి ఉంటాడు తన తండ్ర రెండు లక్షలకు పైనే పంపాడాయె తను. తన చెల్లెలు పెళ్ళి చాలా ఘనంగా జరిగిందన చౌట్ పల్లి నుంచి మస్కట్ వచ్చిన కమ్మరి బుచ్చయ్య చెప్పాడు. ఆ పెళ్ళి ఖర్చు

యాభై వేలు తీసేసినా, యాభై వేలు ఖచ్చితంగా బ్యాంకులో నిలువ ఉండాలి. ఇప్పుడు తెచ్చిన డాలర్లు నగదు చేసుకుంటే ఇరవై వేల దాకా వస్తాయి. బ్యాంకు లోను తీసుకుని ఒక ట్రాక్టరు కొనాలి. అది యాదగిరి గుట్టకు తీసుకుపోయి పూజ చేయాలి. తన "నిలువు దోపిడీ" మొక్కు తీర్చాలి. పౌడర్ డబ్బాలో దాచి పెట్టిన బంగారంతో మైసమ్మకు నగలు చేయించాలి.'

"ఏం పోశయ్యా, ఇప్పుడేనా వచ్చుడు" ఉలిక్కిపడి ఇహలోకంలోకి వచ్చాడు పోశయ్య.

"ఇప్పుడే బస్ దిగిన కాకా" కిష్టయ్యకి బదులు చెప్పాడు.

"నువు యాడికి పోతున్నె?"

"ఇగో, తడపాకల పోతున్నాం. మన ఆశయ్య కొడుకు పుట్టెంటికెలు తీయ్యాలే. నువ్వత్తున్నవని వోల్లు అనలే!"

"అచానక్ రజ దొరికింది. లెటర్ రాసేతందుకు టైమ్ లేకుండె. ఫోను జేత్తె ఇక్కడి ఫోన్లన్ని బందున్నయన్నరు."

"మూణ్ణెల్ల కింద, అన్నలు టెలిఫోన్ ఎక్చేంజి కాలపెట్టిన్నుంచి బంద్ పడ్డయి. ఎప్పుడు బాగయతయో గని అందరికీ బాగ తిప్పలయితుంది. ఎన్నోడ్డులుంటవ్? విజా దెచ్చుకున్నవ?"

"ఇంక రెండేండ్లు విజ దొరికింది గని, ఈన్నే ఉండి ఎగుస జేసుకోవాలనుకుంటున్న. మనూరికి ఇప్పుడేమన్న బస్సున్నదా?"

"బస్సు లేదుగని పట్టెడన్ని జీపులున్నయి. యాభై రూపాలిత్తె మనూర్లె దించుతరు."

"ఐతాయె . పోయెత్తిరి."

★ ★ ★

"బషీర్బాదకు ఏందీసు కుంటవ్?" జీపు డ్రైవర్నడిగాడు పోశయ్య.

"నూరు రూపాలు."

"యాభై దీసుకుంటరు గదా."

"అది ఇక్కడోల్లకు. మస్కటోల్లకు నూరు."

నిర్మొహమాటంగా అన్నడు జీపు డ్రైవరు.

"అదే మస్కటోల్లు వేరోల్లా? అల్లుగుడ ఇక్కడోల్లే గదా!"

"మీరక్కడికి పోయి లక్షలకు లక్షలు కమాయిస్తరు. వేలకు వేల సామాను దెత్తరు. మా అసుంటోల్లకు యాభై రూపాలెక్కిత్తే అరిగిపోతరా? కరిగిపోతరా?""మేం అక్కడ దినంకు పన్నెండు గంటలు కట్టపడి పని జేసింది మీకు పుక్కనకు

(పుణ్యానికి) ఎక్క పైసలు ఇచ్చేతందుకా?"

"ఇగో మిమ్ముల్నోల్లు పుక్కనకు ఇయ్యిమంట లేరు. మారేటు జెప్పినం, నీకిచ్చేదుంటే ఇయ్యి, లేకుంటే లేదు. పొద్దుగల్ల దమాక్ కరాబు జెయ్యకు."

"నీతోనేం కిరికిరి గని, పోదం నడు. గా సామాను జీపులపెట్టియ్యి" తగ్గాడు విసుగు చెంది పోశయ్య.

ఇంటి ముందు జీపు ఆగగానే పిల్లలంతా గుమిగూడారు. పోశయ్య తల్లి, తండ్రి, భార్య, అయిదేళ్ళ కొడుకు, మూడేళ్ళ కూతురు అందరూ బయటికి వచ్చారు. తల్లి వెంటనే కౌగిలించుకుంది. తండ్రి కాళ్లకు మొక్కాడు పోశయ్య. అందరి కండ్లలో నీళ్లు. అవి పోశయ్య క్షేమంగా తిరిగి వచ్చినందుకు సంతోషంతోనా! మూడు సంవత్సరాల ఎడబాటుకు దు:ఖంతోనా! బహుశా రెండూ కారణాలు కావచ్చు.

పిల్లలను దగ్గరికి తీసుకున్నాడు. కళ్లతోనే భార్యను పలకరించాడు. ఎండు మిరపకాయలతో తల్లి దిష్టి తీయగానే ఇంటిలోకి నడిచాడు పోశయ్య.

తెల్లకల్లుకు ఆర్డరు వెళ్లింది. మద్యపాన నిషేధంగా మరి! కటిక వాని ఇంటికి వెళ్ళాడు తండ్రి, మాంసం కొట్టించడానికి. ఆరోజూ, ఆ తర్వాత రెండు రోజులూ, వాళ్ళింట్లో పండగే పండగగా, వేడుకే వేడుకగా గడిచాయి. మెట్‌పెల్లి నుండి చెల్లెలు లక్ష్మి, బావ వెంకటి వచ్చారు. హైద్రాబాద్‌లో చదువుతున్న తమ్ముడు కిషన్ ఆనందంగా, ఉల్లాసంగా గడిపారు. ఎన్నో సుద్దులు చెప్పుకున్నారు. గత మూడేళ్ళలో జరిగిన సంఘటనలు నెమరు వేసుకున్నారు. మస్కట్ విశేషాలు ముచ్చటించుకున్నారు. పోశయ్య తెచ్చిన కానుకలు, వస్తువులు చూసి మురిసిపోయారు.

ఉత్సాహం కాస్త అజాగారగానే, తండ్రి భూమయ్య దగ్గర డబ్బు విషయాలు కదిపాడు పోశయ్య.

"బాకీ అంత తీరింది గదా. ఇల్లు, పొలం ఇడిపిచ్చినవా? బ్యాంకుల ఎన్ని పైసలున్నై?"

'యాడబిడ్డా ఈడ తోడెం కర్సులా! లచ్చిమి లగ్గంకు లక్షదాకాయె. తమ్మడి సదుకు ఎక్కడి పైస జాలకపాయె. ఏదో గొంత బాకి గట్టిన నీ పైసలు మేమేమీ తినలే. ఇంకా రెక్కలు సల్లగున్నై. కట్టం జేసుకుంటనే దింటున్నం."

మిన్ను విరిగి మీద పడినట్టయింది పోశయ్యకు. తాను అనుకున్నదేమి? ఇక్కడ జరిగిందేమిటి! తాను డబ్బు పంపిస్తుంటే వీరు బాకీ తీరుస్తున్నారు గదా అనే అనుకున్నాడు' ఉత్తరాల్లో క్షేమ సమాచారాలు తప్ప రాసేవాడు కాదు. తానూ డబ్బు విషయం అడిగేవాడు కాదు. దాని ఫలితం ఇది!

పోశయ్య ముఖం మ్లానమైంది.

"సెల్లె లగ్గంకి లక్ష రూపాలేంటికైనై?"యాభై వేలు ఉండావను అడుగుతున్నరు.

ల ఆంధ్రాబ్యాంకుల సిపాయి (ప్యూను) పని జేత్తడు. కోశీజ్జేయంగ, శెయంగ అరువై వేలకు ఒప్పుకున్నారు. ఇగ లగ్గం కర్సు నలుబై వేలకు బలిసె" ఉక్రోషంతో అన్నాడు భూమయ్య.
"గంత గనం ఏంటికైనాయి. ఇరువై వేలు సాలలేదా."

"నీకేం నువు గట్లనే అంటౌ. ఈడ సేశినోల్లకు దెలుత్తది. కొడుకు మస్కట్ పోయి వేలకు వేలు పంపిత్తున్నడు. బిడ్డె లగ్గంకు కూరతోని జల్తా (జల్సా) జెయ్యావా అనిరి ఊరోల్లు. రెన్నూరు కిలోల కూర, అయిదు వేల రూపాయల కల్లు, మెట్‌పల్లి పోతందుకు రెండు బస్సులు, తోడెం కర్సయిందే? ఇంతజేత్తే, ఇసిర్నపిండి మీద గీతలు బెట్టినట్టు నువ్వేమో ఇసాబు అడ్గవడ్తివి."

"మరి మిగిలిన రూపాలు?" పోశయ్య వదల దల్చుకోలేదు.

"రెండేండ్ల నుంచి కిషన్ పట్నంల ఉండి సదుకోవట్లా. నెలకు రెండు మూడు వేలు ఆడికే కర్సాయే."

"ఇంటరు సదుకు గన్నిగానం రూపాలా?"

"కాలేజి ఫీజు, హాస్టల్ ఫీజు, కోచింగ్ క్లాసు ఫీజు, పుస్తకాలు, పొట్ట, బట్ట, పట్నంల ఉండి సదుకుంటే ఎన్ని కర్సులు? తిండికి మంచి వ్యవస్థలేక పానం మంచిగ లేకపాయె. జరంతోనే పరీచ్చ లిచ్చిండు గని పేలాయే. ఇప్పుడు యాడనో ఇల్లు జూసుకుని ఉన్నడు. మల్ల పరీక్షకు కడుతున్నాడు." ఇక పోశయ్యకు మాట్లాడడానికి నోరు రాలేదు. తన తండ్రే తనను మోసం చేశాడని అర్థమయింది.

తన చిన్ననాటి నేస్తం రాజయ్యతో కల్లుపాకకు పోయాడు పోశయ్య. ఆ సాయంత్రం రెండు మూడు గ్లాసులు కల్లు పడగానే, అతని మనసులోని దావానలం బయటికి రాసాగింది. "సూశినావుర రాజిగా, మూడేండ్లు మస్కట్ల పని జేశినాగాని, అల్లికి అల్లి, పూజికి పూజి ఆయె నా బతుకు".

"సూశిన, మూడేండ్ల నుంచి మీ నాయన జేసిన కతలన్నీ జూశిన. ఎటుగుడ కొడుకు పైసలు పంపిత్తున్నడని, ఎగుసం జీతగాల్ల మీద పడేసి, కల్లు పాకలనే పడి ఉండే. జల్తలకు, ఏ కోల్లు, యాటలు, సాలకపాయె" రాజయ్య వాస్తవం చెప్పాడు.

"మా తమ్ముడు కిషనన్న ఏమనలేదా, మా నాయినను?

"ఆడేం తక్కున్నడా? ముసలోడు అడిగినన్ని పైసలిత్తే ఆడి మజ ఆడు జేశిండు. పట్నంలో బ్రాందీ, విస్కీ, చికెన్లు, మటన్లు తక్కువా? ఆడొల్ల షోకుగూడ ఉన్నదనంగ ఇన్న. ఇగ పాసెట్లయితడు? నేను జెప్పవోతెనా మీదికి తిరుగవడిరి మీ నాయిన, తమ్ముడు." పోశయ్య కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకుని చేతులు కాల్చుకున్న రాజయ్య తన ఉక్రోషం వెల్లగక్కాడు. తన స్నేహితుడికి జరిగిన అన్యాయానికి మంటగా ఉంది అతనికి.

"విజ ఉన్నాగాని, మస్కట్‌కు పోక ఈడనే ఉండాలనుకున్నా. మంచిగ ఒక ట్రాక్టరు కొనుక్కోని ఎగుసం జేద్దమనుకున్నా. తమ్ముడికి పెద్దసదు జెప్పించి మంచి నౌకరిల

పెద్దమనుకున్న. నేనేమనుకుంటే ఏమయే రాజిగా!". కల్లు మత్తులో ఇంకా వాపోతున్నాడు పోశయ్య. అన్నీ చక్కపరచుదామని, అతన్ని సాంత్వన పరచి ఇంటికి నడిపించాడురాజయ్య

భోజనం చేసి పక్కమీద వాలిన పోశయ్య కళ్ళు నుంచి నీళ్ళు కారుతున్నాయి తనలో తాను గొణుక్కుంటున్నాడు. మైసమ్మకు తన భర్త దు:ఖం భరించరాకుండా ఉంది కొంగుతో అతని కంటినీరు తుడిచి పక్కన కూర్చొని ఓదార్చసాగింది.

"ఏంజేద్దం, మన నశీబు గిట్లున్నది. నాపేరు మీద కాత దీసి పైసలు పంపుమంటె ఇనకపోతివి. మీద వడి కొడితివి. అయితాయె దేవుడిచ్చిన రెక్కలు సల్లగుంటె ఎట్లన్న బతకచ్చు. ఎన్ని బాకీలన్న తీర్చచ్చు. ఇంక గొన్ని దినాలు కట్టెం తోటి ఎల్లదీద్దం. నాకు సొమ్ములద్దు. బంగారమద్దు. నువ్వు గావాల, నీ మనసు నొస్తె నాకు బాదయితది."

ఔను తన భార్యని తప్పుగా అర్థం చేసుకున్నాడు. కుటుంబంలో కలతలు రేపి వేరు పడాలని పన్నిన పన్నాగం అనుకున్నాడు. కాని మైసమ్మ మాటలే నిజం అయ్యాయి ఆమెను నిర్లక్ష్యం చేసినందుకు తనకు తగిన శాస్తి జరిగింది. యాదగిరి నరసింహస్వామికి మొక్కుకున్న "నిలువు దోపిడీ" తనకు ఇంట్లోనే జరిగింది!"

తెల్లవారి లేవగానే పోశయ్య చేసిన మొదటి పని కులం పెద్దలకు తనతండ్రి మీద "బైటాకు" ఇవ్వడం. మరుసటి ఆదివారం కులం పెద్దల సమక్షంలో జరిగిన పంచాయితీలో తన తండ్రి నుంచి వేరు పడ్డాడు పోశయ్య. అతని భాగపు పొలం బాకీ కింద పోయింది రెండు ఎకరాల తోట, ఇల్లులో మూడవ భాగం మాత్రం అతనికి వచ్చాయి. తమ్ముని డిగ్రీ పూర్తయేదాకా తండ్రికి నెలకు నాలుగు వందలు రూపాయలు ఇవ్వాలి. తమ్ముని పెళ్ళి ఖర్చు సగం భరించాలి. తండ్రి భాగపు పొలం, ఇల్లు, తర్వాత తమ్మునికి చెందుతుంది స్థూలంగా ఇదీ ఒప్పందం.

భూమయ్యచే బాగా "సత్కరింప"బడిన పెద్దలు తనకన్యాయం చేశారని తెలుసు అయినా పోశయ్య చలించలేదు. అతనికి దైవం యాదగిరి నరసింహస్వామిపై అపార విశ్వాసం ఉంది. తిరిగి మస్కట్ వెళ్ళే ఉద్దేశ్యం లేకున్నా విజా తెచ్చుకోవడం ఆ దేవుని ప్రేరేపణే అనుకున్నాడు. నెల రోజులుండి మస్కట్ పోవాలని అనుకున్నాడు.

బ్యాంకు మేనేజరు సలహాపై తనపేర ఎన్.ఆర్.ఐ. ఖాతా దినఖర్చులకు భార్యపేర సేవింగ్ ఎకౌంట్ తెరిచాడు.

భార్యా పిల్లలతో యాదగిరిగుట్టకు పోయి తనస్వామిని దర్శించాడు. ఈసారి మస్కట్ నుండి వచ్చిన తర్వాత "నిలువు దోపిడీ" తప్పక ఇస్తానని మొక్కుకున్నాడు.మానవుడు ఆశాజీవి. ఆ ఆశే అతని జీవన నౌకకు ఇంధనం. ఆ ఇంధనమే పోశయ్య మళ్ళీ మస్కట్ పోవడానికి నాంది పలికింది.

తను కోల్పోయిన పొలం తిరిగి కొనాలనే అతని పట్టుదల, ఈసారి నిజం "నిలువు దోపిడీ" తన స్వామికి అర్పించాలనే అతని తపన అతన్ని ముందుకు నడిపించింది.